క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



ఆలయంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు దర్శించుకున్నారు. సాయంత్రం ఆయన స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, పూతలపట్టు మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, ఐరాల మండల కన్వీనర్ బుజ్జి రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆయనతోపాటు తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

23న విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సాధారణ సర్వసభ్య సమావేశం, కార్యవర్గ ఎన్నిక ఈనెల 23న నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు అన్నారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నికకు సంబంధించి నామినేషన్‌ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈనెల 23న ఉదయం సాధారణ సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. ఎన్నికల అధికారి రామాంజనేయులు సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

ఈ క్రాప్ నమోదు వేగవంతం



జంగాపల్లెలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న అధికారులు

యాదమరి: మండల పరిధిలో ఈ క్రాప్ బుకింగ్ వేగవంతంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ కోరారు. మండల పరిధిలోని శనివారం జంగాపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఆయన పర్యటించారు. వ్యవసాయశాఖ సిబ్బంది ఈ క్రాప్ నమోదును పరిశీలించారు. తప్పులు లేకుండా నమోదు చేయాలని, ఈ క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాలు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి పలు రికార్డులు తనిఖీ చేశారు. రైతులు అడిగిన వెంటనే ఎరువులు అందించాలని చెప్పారు. పంటలు పండించే ముందు భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు ఎలాంటి పంటలు వేస్తే లాభదాయకమో వారికి వివరించి పంటలు వేసేలా చూడాలన్నారు. మండల పరిధిలోని వ్యవసాయ సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే ఉంటే చర్యలు తప్పవని, రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖ సంచాలకులు మధుసూదన్ రెడ్డి, యాదమరి వ్యవసాయశాఖ ఏఓ చరిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోతో జ్ఞాపకాలు పదిలం



పాలు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

బంగారుపాళెం: జ్ఞాపకాలను పదిలంగా చూపేదే ఫొటో అని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకరన్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగులే చిత్రపటానికి పూజలు నిర్వహించారు. శంకరన్ మాట్లాడుతూ, లూయిస్ రూపొందించిన కెమెరాల వల్ల నేడు ఎందరో ఫొటోగ్రాఫర్ల జీవన విధానానికి దారి చూపిందని కొనియాడారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు రొట్టె, పాలు, పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్ విజయకుమారి, కార్యదర్శి చిట్టిబాబు, కోశాధికారి చాన్‌భాషా, ఫొటోగ్రాఫర్లు తేజ, దుర్గాప్రసాద్, రేవంత్, మురళి, అయూబ్, సంధ్య, కార్తీక్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

ఐరాల: మౌనికను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



యాదమరి: రజనీని అభినందిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి



సంక్షేమ పథకాలదే గెలుపు

- రెండు చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయం
- వార్డు సభ్యుల ఎన్నికలకు భారీ బందోబస్తు
- ఎన్నికలను పరిశీలించిన ఎస్పీ, జెడ్పీ సీఈఓ

కాణిపాకం(యాదమరి): పూతలపట్టు నియోజకవర్గంలోని ఐరాల, యాదమరి మండలాల్లో రెండు వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో గొడవలు, ఘర్షణలు ఉంటాయని టీడీపీ నాయకులు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో రెండు చోట్ల వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించింది. దీంతో ప్రజలందరూ సంక్షేమ పథకాల సారథి జగనన్న వైపే ఉన్నారని మరోసారి నిరూపితమైంది.

పది వార్డులకు నోటిఫికేషన్

నియోజకవర్గంలోని పూతలపట్టులో ఒకటి, యాదమరిలో మూడు, బంగారుపాళ్యంలో మూడు, తవణంపల్లెలో ఒకటి, ఐరాలలో రెండు వార్డులు మొత్తం పది వార్డులకు ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో ఎనిమిది వార్డులకు ఏకగ్రీవం కాగా యాదమరి మండలంలో కాశిరాళ్లలోని 2వ వార్డుకు వైఎస్సార్‌సీపీ, టీడీపీ, ఇండిపెండింట్ మద్దతుదారులు, ఐరాల మండలంలో కాణిపాకం పంచాయతీ 5వ వార్డుకు వైఎస్సార్‌సీపీ, టీడీపీ మద్దతుదారులు నామినేషన్లు వేశారు. దీంతో ఇక్కడ ఎన్నికలు ఖరారయ్యాయి. టీడీపీ నాయకులు కావాలనే పోలీసులను తప్పుదారి పట్టించారు. కాశిరాళ్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొడవలు చేస్తారని చెప్పడంతో స్వయంగా ఎస్పీ రిశాంత్ రెడ్డి, చిత్తూరు వెస్ట్ సీఐ రవికుమార్ రెడ్డి, గుడిపాల ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 50 పోలీసులతో గట్టి బందోబస్తు నిర్వహించారు. కాణిపాకంలోను వైఎస్సార్‌సీపీ నాయకులతో సమస్యలు ఎక్కువని చెప్పడంతో అక్కడ స్వయంగా జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. రెండు చోట్ల హోరాహోరీగా ఎన్నికలు జరిగాయి. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. యాదమరిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు రజని, టీడీపీ మద్దతుదారు నందకుమార్‌పై 12ఓట్లతో గెలుపొందారు. కాణిపాకంలో టీడీపీ మద్దతుదారు సుగుణపై వైఎస్సార్‌సీపీ మద్దతుదారు మౌనిక 23 ఓట్లతో గెలుపొందారు.



కాశిరాళ్ల ఎన్నికల కేంద్రంలో ఎస్పీ రిశాంత్ రెడ్డి, వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి



కాణిపాకంలో సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టీడీపీ అత్యుత్సాహం

నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మురళీమోహన్‌ను ప్రకటించారు. ఆ తరువాత వార్డు సభ్యులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ సారి ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవం కానివ్వకుండా, ఎలాగైనా పోటీ పెట్టాలని శాయశక్తులా ప్రయత్నించారు. చివరకు ఐరాల మండలంలో కాణిపాకం, యాదమరి మండలంలో కాశిరాళ్ల పంచాయతీలో మద్దతుదారులను బరిలో నిలిపారు. ఒక్కటైన గెలిచి సత్తా చాటుకోవాలని చూశారు. కానీ ఓటర్లు జగనన్న సంక్షేమ పాలనకు మరోసారి అండగా నిలిచారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత పటిష్టంగా మారింది.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు

రెండు చోట్ల వార్డు సభ్యుల గెలుపుతో వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టపాకాయలు పేల్చి, డప్పులు వాయిస్తూ పురవీధుల్లో సంబరాలు జరుపుకున్నారు. యాదమరి మండలంలో గెలుపొందిన రజనికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, మనోహర్ రెడ్డి పూలమాల వేసి అభినందనలు తెలిపారు. కాణిపాకంలో గెలుపొందిన మౌనికను పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఐరాల మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, తదితరులు అభినందించారు.

వచ్చే ఎన్నికల్లోనే ఇదే విజయం తథ్యం

నియోజకవర్గంలో జరిగిన ఈ వార్డు సభ్యుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలుపొందినట్లే, వచ్చే ఎన్నికల్లోనూ ఫ్యానుగాలి వీస్తుందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. వార్డు సభ్యుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా కృషి చేశారన్నారు. జగనన్న సీఎం అయిన తరువాత పార్టీలు చూడలేదు, కులాలు చూడలేదు అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించారని గుర్తు చేశారు. వీటిని గుర్తు పెట్టుకున్న ఓటర్లు టీడీపీ నాయకులు ఎంతో ప్రలోభ పెట్టినా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల గెలుపును అడ్డుకోలేకపోయారని చెప్పారు. ఈ ఎన్నికలే కాదు ఇక రానున్న ఎన్నికల్లో కూడా ప్రతి ఓటరు వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తారని స్పష్టం చేశారు. ఇక టీడీపీ నాయకులు ప్రశాంతంగా నిద్రపోవచ్చని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుధీర్, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

మామిడి కొమ్మల కత్తిరింపు తప్పనిసరి

– జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి



అరగొండలో మామిడి కొమ్మల కత్తిరింపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తవణంపల్లె: మామిడి పంట కోతలు పూర్తయిన తరువాత కొమ్మలను తప్పనిసరిగి కత్తిరించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని గాజులపల్లె రోడ్డులో ఉన్న గౌరీ శంకర్ కల్యాణ మండపంలో శనివారం మామిడి కోతల అనంతరం చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోత అనంతరం రైతులు విధిగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. మామిడి పంట సాగులో ఖర్చులు తగ్గించే విధంగా రైతులకు అవగాహన కల్పించారు. కొమ్మల కత్తిరింపులు అనంతరం లీటర్ నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. తర్వాత మామిడి తోటల్లో జనుము, జీలుగ, పిల్లి పెసర లాంటి మొక్కలను పోషించి దుక్కిలో కలిపి దున్నితే భూమి సారవంతం అవుతుందని అన్నారు. ఉద్యాన కళాశాల ప్రొఫెసర్, శాస్త్రవేత్త రామయ్య మాట్లాడుతూ 10 సంవత్సరాల మామిడి చెట్లకు 100 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల యూరియా, 5 కిలోల సూపర్ ఫాస్ఫేట్ ఎరువులను చెట్టు మొదలు నుంచి మూడు అడుగుల దూరంలో గాడి తీసి వేయాలని సూచించారు. మామిడి తోటల్లో వాలుకు అడ్డంగా రెండు సార్లు దున్నితే సరిపోతుందని వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో మామిడి కొమ్మలను కత్తిరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి లక్ష్మీప్రసూన, ఏఓ ప్రవీణ్, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులందరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని ఉపాధ్యాయులందరూ ఒక్కో మొక్కను నాటి సంరక్షించాలని ఎంపీడీఓ గౌరి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఆమె మొక్కలను నాటారు. ఆమెతోపాటు మహిళా ఉపాధ్యాయులు కలిసి ఒక్కో మొక్క చొప్పున నాటారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 20 సంవత్సరాల ముందు భూమి ఎక్కడ చూసినా బాగా ఎదిగిన చెట్లతో నిండిపోయి ఉండేదని గుర్తుచేశారు. తద్వారా ప్రాణవాయువు అయిన స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను పీల్చుకుంటూ చాలా కాలం పాటు మానవులు బతికేవారని తెలిపారు. కాల క్రమేణా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెట్లను, అడవులను నరుక్కుంటూ పోవడం వల్ల గాలి కాలుష్యం విపరీతంగా పెరుగుతుందన్నారు. విద్యార్థులందరూ వీలైనంతవరకు మొక్కలను నాటి పెంచాలని సూచించారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం నివారించాలని విద్యార్థులకు సూచించారు. విశ్వనాథ రెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణమూర్తి, నీరాజాక్షుల నాయుడు, సురేంద్రరెడ్డి, నాదముణి, కృష్ణవేణి, మాధవి, లత, విద్యార్థులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌వో రాజశేఖర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్‌వో చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ ఈ నెల 21, 22 తేదీల్లో ఏపీపీఎస్సీ పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని సీతమ్స్ కేంద్రంలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ పరీక్షలకు 390 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు చెప్పారు.

సారా పట్టివేత: వ్యక్తి అరెస్టు



పట్టుబడిన నిందితుడు

చిత్తూరు అర్బన్: మండలంలోని తుమ్మింద క్రాస్‌లో శనివారం ఎస్ఈబీ అధికారులు దాడి చేశారు. యాదమరి మండలం కొట్టాలకు చెందిన గోవర్ధన్ నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్ బాబు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలు







ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత, పూతలపట్టు: రోగితో మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక, గుడిపాల: వైద్యం చేస్తున్న డాక్టర్ సందీప్

ఐరాల: పల్లె ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ఇంటి వద్దనే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని నెల్లిమందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 95 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచింతగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే వైద్యం

పూతలపట్టు: మండలంలోని కమ్మగుట్టపల్లిలో శనివారం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో కీళ్ల నొప్పులతో బాధపడుతున్న సుబ్రమణ్యం నాయుడు నడవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. దీంతో ఆయనకు ఇంటివద్దకే వెళ్లి పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందజేశారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా పంచాయతీలోని ప్రతి ఇంటికీ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

పెద్దిశెట్టిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: మండలంలోని పెద్దిశెట్టిపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి హరి 62 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటి వద్ద మంచానికి గురైన రోగుల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తేజ, ఇందుమతి, నిరోషా, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపరిష్కారానికి చర్యలు



కమిషనర్ అరుణకు సమస్యలు విన్నవిస్తున్న నాయకులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కమిషన్ అరుణ చర్యలు తీసుకుంటున్నట్లు ఏఐటీయూసీ నాయకులు నాగరాజు, గోపినాథ్ తెలిపారు. చిత్తూరు నగరం నగరపాలకసంస్థ కార్యాలయంలోని ఆమెను కలిసి వారు కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మణి, జయశంకర్, సురేష్, వినాయక, సుగుణ, శోభన్‌బాబు, సుభాషిణి, సుకన్య, చిత్ర, ఈశ్వరన్ తదితరలు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు



మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ బీఎస్‌కే నాయక్

చిత్తూరు రూరల్: వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని డీసీహెచ్ఎస్ బీఎస్‌కే నాయక్ హెచ్చరించారు. ఇటీవల వస్తున్న ఘటనలపై ఏపీవీపీ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని సమావేశ మందిరంలో శనివారం ఆయన ప్రసూతి, చిన్నపిల్లలు, అత్యవసర విభాగంలో పనిచేసే డాక్టర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చాలా మంది గైర్హాజరవుతూ సొంత క్లినిక్‌లకు వెళుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రెఫర్ కేసులు అధికమవుతున్నాయని, అనవసరంగా రెఫర్ చేయకూడదని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోను మందులు, మాత్రలు బయటకు రాసి ఇవ్వకూడదని హెచ్చరించారు. హెడ్‌నర్సులు, సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు నిత్యం వార్డులను పర్యవేక్షించాలని తెలిపారు. ప్రధానంగా అపోలో, ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. డీఐఓ రవిరాజు, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అపోలో సూపరింటెండెంట్ సుధాకర్, ఆర్ఎంఓ సంధ్య, అధికారులు గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వేడుకగా శ్రీరేణుకా దేవి ఉత్సవం



అమ్మవారి సేవలో విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: నగరంలోని శ్రీ రేణుకదేవి ఆలయంలో శనివారం అమ్మవారి ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. మూలస్థానంలోని అమ్మవారు విశేష పూజల అనంతరం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. దీనికి ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు నిర్వాహకులు ఘనస్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికుమార్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- 46వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం



దివ్యాంగుడికి సంక్షేమ బావుటా అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని 46వ డివిజన్ పత్రాంపల్లె, ఓబనపల్లె ప్రాంతాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో కూడిన సంక్షేమ బావుటా బ్రోచర్‌ను అందజేశారు. స్థానికంగా ఉండే సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రజల కనీస అవసరాలను పట్టించుకోకుండా కేవలం పబ్లిసిటీతో గత ప్రభుత్వం కాలం వెళ్లబుచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని వివరించారు. అందులో భాగంగానే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తాము చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల ముందు ఉంచుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు జగనన్న ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చినట్లు చెప్పారు. డివిజన్ రహదారులను అభివృద్ధి చేసి నివేశస్థలాల సమస్య తీర్చాలని, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని స్థానికులు సమస్యలను విన్నవించారు. సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆరణి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రెడ్డెప్ప, మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు రాజా, కో–ఆప్షన్ మెంబర్ కోలా కిరణ్, కార్పొరేటర్ చాన్‌బాషా, నాయకులు అమరా, గోపి, శివ, రోహిత్, శివారెడ్డి, గోపి, రవిరెడ్డి, సీతాపతి, ద్వారక, బబూ, అల్తాఫ్, వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు పాంచాలిపురంలో..

స్థానిక 46వ డివిజన్ పాంచాలిపురంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు శనివారం ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.